

ఆర్టీసీ చైర్మన్‌గా ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి హైదరాబాద్‌లోని బస్‌భవన్‌లో ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అభినందనలు తెలుపుతున్న సంస్థ ఎండీ సజ్జనార్, అధికారులు, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి కుటుంబసభ్యులు

# వాస్విక్ ఫౌండేషన్‌కు ప్రపంచస్థాయి గుర్తింపు

**సర్వీస్ ఎక్సలెన్సీ అవార్డు అందుకున్న చైర్మన్ నరేశ్‌కుమార్**

బచ్చన్నపేట, అక్టోబర్ 8: జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం కట్కూర్ గ్రామానికి చెందిన నిడిగొండ నరేశ్‌కుమార్ తన కుమారుడి పేర స్థాపించిన వాస్విక్ ఫౌండేషన్‌కు ప్రపంచ స్థాయిలో గుర్తింపు లభించింది. ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన సేవా కార్యక్రమాలను గుర్తించి వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లండన్ వారు సర్వీస్ ఎక్సలెన్సీ అవార్డు, సర్టిఫికెట్ ప్రకటించగా, ఆదివారం ఢిల్లీలో చైర్మన్ నరేశ్‌కుమార్, వైస్ చైర్మన్ నూకల భాస్కర్‌రెడ్డి యూకే పార్లమెంట్ అధికారుల చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా నరేశ్‌కుమార్ మాట్లాడుతూ..కరోనా కష్టకాలంలో వేలాదిమందికి సేవా కార్యక్రమాలు అందజేశామన్నారు. ఇందులో సంస్థ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, మరి కొంత మంది సైనికుల సహకారంతో ఉందన్నారు. అవార్డు మరింత బాధ్యత పెంచిందన్నారు. తమ సంస్థ సేవలను గుర్తించిన వరల్డ్ బుక్ఆఫ్ రికార్డ్స్ లండన్ వారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు ఉప్పలంచి హేమంత్, ఇలియజర్ పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న వాస్విక్ ఫౌండేషన్ చైర్మన్ నరేశ్‌కుమార్

# సీఎం కేసీఆర్ పాలనలో ఇంటింటికీ సంక్షేమం

- ఐటీ కంపెనీల స్థాపనతో యువతకు ఉద్యోగాలు
- దళితబంధుతో దళితుల జీవితాల్లో వెలుగులు
- పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి..
- మహబూబాబాద్ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్

కేసముద్రం, అక్టోబర్ 8 : సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రంలోని ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందుతున్నాయని మహబూబాబాద్ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. మండలంలోని ధన్నసరి నుంచి బేరువాడకు రూ.1.50 కోట్లతో బీటీ రోడ్డు, ధన్నసరి నుంచి చెరువుముందు తండాకు రూ.1.50 కోట్లతో బీటీ రోడ్డు, తాళ్లపూసపల్లి నుంచి పెద్దమోరి తండా వరకు రూ.3 కోట్లతో బీటీ రోడ్డు, తాళ్లపూసపల్లి నుంచి రాజ్యతండా వరకు రూ.2 కోట్లతో బీటీరోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ధన్నసరి గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన 25 మంది బీఆర్ఎస్ పార్టీలో చేరగా, ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అధికారంలో వచ్చిన వెంటనే మిషన్ కాకతీయ పథకంతో చెరువులను బలోపేతం చేసినట్లు తెలిపారు. గోదావరి నదిపై కాళేశ్వరం ప్రాజెక్టును రాష్ట్రంలోని ప్రతి చెరువునూ నింపి రైతులకు పుష్కలంగా సాగు నీళ్లు ఇస్తున్నట్లు చెప్పారు. బోర్లు, బావుల్లో నీరు సమృద్ధిగా లభించి రైతులు ఏడాదికి రెండు, మూడు పంటలు పండించి ఆర్థికంగా బలోపేతమవుతున్నారని అన్నారు. కల్యాణలక్ష్మి పథకం ద్వారా అందిస్తున్న రూ.1,00,116 పేదింటి ఆడబిడ్డల కుటుంబాలకు అండగా ఉంటున్నాయన్నారు. యాదవులకు గొర్రెలు, ముదిరాజ్‌కు చేపలు పంపిణీ చేస్తూ ఉపాధి కల్పిస్తున్నట్లు చెప్పారు. కులవృత్తులకు పూర్వవైభవం తీసుకొచ్చేందుకు బీసీలకు రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. సొంత జాగ ఉండి ఇల్లు నిర్మించుకునే పేదలకు గృహలక్ష్మీ పథకం ద్వారా రూ.3లక్షలు అందిస్తున్నట్లు తెలిపారు. ఇండ్ల స్థలాలు లేని నిరుపేదలకు స్థలాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చి, నిధులు కేటాయించి మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. దళితబంధు పథకంతో దళితుల జీవితాల్లో వెలుగులు నిండాయన్నారు. పోడు రైతులకు పట్టాలు అందించామని తెలిపారు. 3 గంటలు కరెంటు చాలన్న కాంగ్రెస్ కావాలో.. 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్న బీఆర్ఎస్ కావాలో ప్రజలు నిర్ణయించుకోవాలన్నారు. ఎన్నికల సమయంలో వచ్చే కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. ఒక్కసారి అవకాశం ఇవ్వండి.. అని చెబుతున్న కాంగ్రెస్ నాయకులు 46 ఏండ్లు అధికారంలో ఉండి ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అమ్మడంతో నిరుద్యోగ సమస్య పెరుగుతున్నదన్నారు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటులో కేంద్ర ప్రభుత్వ విఫలమైందన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్న సీఎం కేసీఆర్ రుణం తీర్చుకోవడానికి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

## వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబర్8 : బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరిని గెలిపించాలంటూ మండల వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి ఆదివారం మండలంలోని తాటికొండ గ్రామ పంచాయతీ వద్ద వాల్ పోస్టర్లను, వాహన స్టిక్కర్లను పార్టీ శ్రేణులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల వైస్ ఎంపీపీ మాట్లాడుతూ.. ఎన్నికలప్పుడే కనిపిస్తూ, అభివృద్ధిని అడ్డుకునే పార్టీలను ప్రజలు నమ్మొద్దన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. అనంతరం గ్రామంలోని యువతకు వాలీబాల్ కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మారపాక రాములు, వార్డు సభ్యురాలు లావణ్యారమేశ్, రేణుకాఎల్లస్వామి, ఆటో యూనియన్ ప్రెసిడెంట్ సాజిద్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు మోసిన్, మండల యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ పాలకుర్తి నాగరాజు, సోషల్ మీడియా మండల ఇన్‌చార్జి ప్రశాంత్, గ్రామ యూత్ ప్రెసిడెంట్ బొల్లం నాగరాజు, మహిళా అధ్యక్షురాలు బేతి మంజుల, వీవోఏలు అక్కనపల్లి సరిత, ఖలీదా నాయకులు పాల్గొన్నారు.



తాటికొండలో వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైస్ ఎంపీపీ సుధీర్‌రెడ్డి

